క్లుప్తంగా

కూతురిని టీచర్ కొట్టాడని తల్లిదండ్రుల ఆగ్రహం



రాయపర్తి : తమ కూతురిని ఉపాధ్యాయుడు కొట్టాడని విద్యార్థి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఏకేతండా ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థిని హలావత్ శ్రీజను ఉపాధ్యాయుడు ఆకారపు స్వామి శనివారం కొట్టాడని వారు పేర్కొన్నారు. ఈ విషయమై సదరు ఉపాధ్యాయుడిని వివరణ కోరగా తాను కావాలని కొట్టలేదని, అనుకోకుండా తగిలిందని తెలిపారు.

మొక్కలు నాటిన కౌన్సిలర్



నర్సంపేట : నర్సంపేటలోని పదో వార్డులో గల పోచమ్మతల్లి ఆలయంలో కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్ పూజారులు, ఆలయ అభివృద్ధి సభ్యులతో కలిసి శనివారం పూల మొక్కలు నాటారు. నేడు(ఆదివారం) నుంచి పోచమ్మ బోనాలు మొదలవుతుండడంతో పట్టణ ప్రజలు, ఆడపడుచులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పద్మప్రసాద్ మాట్లాడుతూ పోచమ్మ దేవాలయం అభివృద్ధితో పాటు ఆహ్లాదకరంగా ఉండే విధంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే అమ్మవారి పూజకు ఉపయోగకరమైన పూల మొక్కలను నాటినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



నర్సంపేట : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి పైసా గణేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా జీవన్, అధ్యక్షుడిగా అఖిల్, సహాయ కార్యదర్శి అజిత్, చందు, లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా కార్తీక్, రాజు, సభ్యులుగా ప్రశాంత్, విజయ్, కిరణ్, అరవింద్, శివ, సాగర్, జస్వంత్, రాకేష్, దేవా, నవీన్, అఖిల్‌ను ఎన్నుకున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన గై.అశోక్(35) వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు గీసుకొండ పోలీసులు తెలిపారు. ఈ నెల 11న పనికి వెళ్లి మద్యం తాగి ఇంటికి వచ్చి పడుకున్నాడని, మరుసటి రోజు తెల్లవారు జామున మూత్ర విసర్జనకు వెళ్లి కింద పడిపోయి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే ఆస్పత్రిలో చేర్పించగా మృతి చెందాడని మృతుడి భార్య అర్చన ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ



గీసుకొండ : మండల కేంద్రంలో ప్రపంచ మానవత్వపు దినోత్సవం సందర్భంగా ఆపద్బాంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గ్రామంలోని సానపెల్లి ఎలీషా పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తుండగా ఆమె భర్త కట్టయ్య పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఫౌండేషన్ ప్రతినిధి కర్ణకంటి రాంమూర్తి, సర్పంచ్ బాబు రూ. 50 కిలోల బియ్యం, ఇంటికి అవసరమైన నిత్యావసర సరుకులను వారికి పంపిణీ చేశారు.

ఎమ్మెల్యే 'పెద్ది' సహకారంతో అభివృద్ధి



చెన్నారావుపేట : నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సహకారంతోనే గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు సర్పంచ్ కొండవీటీ పావని ప్రదీప్‌కుమార్ అన్నారు. ఈ మేరకు స్థానిక ఫంక్షన్‌హాల్‌లో శనివారం గ్రామ శివారులోని పాకాల వాగుపై బ్రిడ్జి మంజూరుకు, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంతో సర్పంచ్ చర్చి ఫాదర్ తుమ్మ యాగారెడ్డి, ఉప సర్పంచ్ పూదోట శౌరిరాజు, గ్రామ ప్రజలు రెడ్డి మాసి కిశోర్, పుట్టి భాస్కర్‌లతో పాటు పలువురు సన్మానించారు. అనంతరం టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నరిశెట్టి రాజు, వార్డు సభ్యులు మంద చిన్ను, ధరావత్ రమ, రమేష్, మహ్మద్ హసీనా బేగం, అప్సర్, గుడిపెద్దలు జయరాజు, జోజి, కస్పరాజు, సతీష్‌కుమార్, కిరణ్‌కుమార్, రవి ఉన్నారు.

ప్రయాణం నరకప్రాయం



గుంతలమయంగా పాపయ్యపేట రోడ్డు

- గుంతలమయంగా రోడ్లు
- వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

చెన్నారావుపేట : గుంతల రోడ్లతో ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది.. అడుగు తీసి అడుగు వేయలేకుండా పెద్ద పెద్ద గుంతలతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.. చెన్నారావుపేట క్రాస్ నుంచి తిమ్మరాయినిపహాడ్, పాపయ్యపేట వరకు అడుగుకో మడుగు దర్శనమిస్తోంది.. ఈ గుంత రోడ్లపై వాహనాలు ఉయ్యాల ఊగుతూ వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని వాహనాదారులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చెబుతున్నారే తప్ప పనులు మాత్రం ప్రారంభించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. కనీసం రోడ్డు మరమ్మతుల పనులు కూడా చేపట్టడం లేదని ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల్లో ప్రయాణం చేస్తున్నప్పుడు అనారోగ్యాలకు గురవుతున్నామని, ఆస్పత్రుల ఖర్చులు పెరుగుతున్నాయని చెబుతున్నారు. అధికారులు, పాలకులు ప్రత్యేక చొరవతో పనులు చేపట్టాలని కోరుతున్నారు.

మరమ్మతు చేయాలి



గుంతల రోడ్డుపై వాహనం నడపాలంటే నరకం కనిపిస్తుంది. పెద్ద పెద్ద గుంతలతో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులు కిందపడి ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. వెంటనే ప్రజా ప్రతినిధులు, అధికారులు, రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలి.

- మహ్మద్ అమీరొద్దీన్, పాపయ్యపేట

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



నర్సంపేట: లూయిస్ దాగురే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఫొటో గ్రాఫర్లు



ఖానాపురం: జెండావిష్కరిస్తున్న ఫొటో గ్రాఫర్లు



చెన్నారావుపేట: కేక్ కట్ చేస్తున్న బాధ్యులు

నర్సంపేట : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా ఫొటో గ్రాఫర్లు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు పట్టణంలో ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బండారి సురేష్ ఆధ్వర్యంలో 184వ వార్షిక ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్ గౌరవ అధ్యక్షుడు తక్కళ్లపల్లి సోమేశ్వర్ ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ జాక్స్ మండె డాగురే చిత్ర పటానికి పూలమాల వేసి ఛాయాచిత్ర పతాక ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో దొంతి సంతోష్‌కుమార్, గట్ల అమరేందర్, బేతి విశ్వబంధు(భాస్కర్), గిరగాని దుర్గేష్‌గౌడ్, బేతి కన్నయ్య, కుసుమ శంకర్, ఎస్‌కె.జావిద్, మెదరమెట్ల వెంకన్న, తాటికొండ శివ, నర్సింగరాములు, నరేందర్, సతీష్, మచ్చిక రాజ్‌కుమార్‌గౌడ్, రాజేందర్, డివిజన్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ దినోత్సవం

చెన్నారావుపేట : మండల కేంద్రంలో ఫొటోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. ఫొటోగ్రఫీ పితామహుడు దాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్ దొంతి సతీష్‌గౌడ్‌ను సన్మానించారు. డివిజన్ బాధ్యులు దొంతి సంతోష్‌గౌడ్, మండల కార్తీక్, పుట్ట రాజు, రమేష్, లక్ష్మణ్, ఇస్లావత్ గోపి, పోలు రాజు, మహేష్, తడక రాజుగౌడ్ ఉన్నారు.

ఖానాపురంలో..

ఖానాపురం : మండల వ్యాప్తంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఫొటో గ్రాఫర్స్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు పడాల మురళి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి జెండా ఎగుర వేసి వేడుకలను చేపట్టారు. రాజు, కోటి, స్వామి, రవి, రాజేందర్, ప్రవీణ్, వెంకటేష్, కిరణ్, రమేష్, శ్రీను, ఫరీద్, శ్రీను, యాకయ్య పాల్గొన్నారు.

చేయూత



సాయం అందజేస్తున్న స్నేహితులు

ఖానాపురం : మండలంలోని కొత్తూరుకు చెందిన రవి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని రవి స్నేహితులు పరామర్శించారు. ఖానాపురం మండల కేంద్రంలోని నేతాజీ గురుకుల విద్యాలయంలో చదువుకున్న 1999 బ్యాచ్‌కు చెందిన పూర్వ స్నేహితులు రూ.35,016లను బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో సతీష్, రమేష్, పాలిపాక ఎర్రయ్య, లలిత, పర్వీన, సాంబయ్య, పూర్ణ, రమేష్, సతీష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి

చెన్నారావుపేట : మహిళలకు ఉచిత కుట్టు శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని ఏపీఓ ఈశ్వర్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ, ప్రభుత్వ సహకారంతో సెట్విన్, న్యాక్ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సమన్వయంతో మండలంలో ఆసక్తి, అర్హత కలిగిన మహిళా సభ్యులకు కుట్టు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలో 10 శిక్షణ యూనిట్లను ఏర్పాటు చేసి ప్రతి యూనిట్ కేంద్రంలో 50 మంది మహిళలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. సర్టిఫికెట్, కుట్టు మిషన్‌తో పాటు టెక్స్‌టైల్ పార్కులో రిక్రూట్‌మెంట్ కల్పిస్తామన్నారు. శిక్షణ కోసం లేబర్ కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు పదో తరగతి పాసైన మహిళలు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకోని వారు వీఓఏలకు, సీసీలకు, మండల సమాఖ్య కార్యాలయంలో నేరుగా సంప్రదించాలన్నారు. ఎవరికి ఎటువంటి డబ్బులు ఇవ్వకూడదన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, ఐసిబ్బంది

నర్సంపేట : సమాజంలోని ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీడీపీఓ రాధిక కోరారు. ఈ మేరకు పట్టణంలో 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదంతో ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా శనివారం 5కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సంపేట ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు 5కే రన్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని వరంగల్ రోడ్డు కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ విద్య, హేమలత, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి, సూపర్‌వైజర్లు మంజుల, శ్యామల, శ్రీదేవి, రమాదేవి, మాధవి, రాధ, ఝాన్సీరాణి, హేమలత, నజ్మా, పారిజాతం, వాసంతి, జయవాణి, ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి శిరీష, అరుణకుమారి, శ్రీదేవి, వెంకటలక్ష్మి, రాణి, రమాదేవి, సుగుణ, మండలాల నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



వర్ధన్నపేట: మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అరూరి రమేశ్ తదితరులు

వర్ధన్నపేట : వర్ధన్నపేటకు చెందిన రామగిరి పరమేశ్వరచారి(60) శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కాగా ఎమ్మెల్యే అరూరి రమేష్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు శనివారం పరమేశ్వరచారి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వీరి వెంట ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, తుమ్మల యాకయ్య, సిలువేరు కుమారస్వామి, తూళ్ల కుమారస్వామి, నందిపాక భాస్కర్ ఉన్నారు.

యాకయ్యకు పరామర్శ

పర్వతగిరి : ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై ఎంజీఎంలో చికిత్స పొందుతున్న యాకయ్యను శనివారం వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ నాయకుడు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కేఆర్.నాగరాజు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ , ఎంపీటీసీ లావుడ్యా సరోజన లక్ష్మ నాయక్, మహేష్, కుమార్ పాల్గొన్నారు.

'గడప గడపకు కాంగ్రెస్'



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నెక్కొండ : అధికారమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పని చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ అన్నారు. మండలంలోని పెద్దకొర్పోలు గ్రామంలో శనివారం యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అందించే అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనా వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టాలని ఆయన కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ గెలుపులో యువత పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల హరీష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్, మండల అధ్యక్షుడు రావుల మహిపాల్‌రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గై లక్ష్మణ్, గ్రామ శాఖ అధ్యక్షుడు భీమన్న, నాయకులు బొడ్డుపల్లి యాదగిరి, పడాల రవికుమార్, రవి, రామారపు రాము, రాజేందర్, కమల్‌హాసన్, వెంకన్న పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



విచారిస్తున్న డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు

దుగ్గొండి : మండలంలోని మల్లిపల్లి గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం, అవినీతి, అక్రమాలు జరిగాయని స్థానికుడు భాషబోయిన సంజీవయ్య ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో శనివారం డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా పలు రికార్డులు తనిఖీ చేశారు. పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్‌కు నివేదించనున్నట్లు డీఎల్‌పీఓ వివరించారు. విచారణలో ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, సర్పంచ్ ఇట్టబోయిన స్వామి, పంచాయతీ కార్యదర్శి శివ, సమాచార హక్కు రక్షణ చట్టం ప్రతినిధులు కరుణాకర్, విద్యాసాగర్, సత్య, సుధాకర్, మోహన్, కరీం, ఎల్లారెడ్డి, శివాజీ, దుడాలు, దేవరాజు, విక్కి పాల్గొన్నారు.

పోలీసులను విధుల నుంచి తొలగించాలి

- ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భూక్యా జగన్‌నాయక్, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజశేఖర్



మాట్లాడుతున్న భూక్యా జగన్‌నాయక్

నర్సంపేట : హైదరాబాద్ ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో విచారణ పేరుతో గిరిజన మహిళపై దాడి చేసిన పోలీసులు, ఎస్సైపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భూక్యా జగన్‌నాయక్, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కట్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో ఎల్‌హెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్, టీఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లో వరలక్ష్మి అనే గిరిజన మహిళ భర్త మృతి చెందడంతో ముగ్గురు పిల్లలను చూసుకుంటూ ఇళ్లలో పని చేసుకుంటూ జీవన సాగిస్తోందని తెలిపారు. ఈనెల 14న కూతురు పెళ్లి ఖర్చుల కోసం దేవరకొండలో ఉండే తన అన్న దగ్గరకు వెళ్లి రూ.3 లక్షలు తీసుకొని 15వ తేదీ రాత్రి 11 గంటలకు ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డు వద్దకు చేరుకుందన్నారు. ఈ క్రమంలో పోలీసులు రాత్రి 11 గంటలకు వచ్చి మీరెందుకు ఇక్కడ నిలబడ్డారంటూ అక్కడ ఉన్న ట్రాన్స్ జెండర్లతోపాటు లక్ష్మిని వ్యాన్‌లో ఎక్కించుకొని ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారని తెలిపారు. 48 గంటల పాటు పోలీసులు కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులను సస్పెండ్ చేయడమే కాకుండా విధుల నుంచి తొలగించడంతోపాటు ఎస్సై పై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీఎస్ఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు ధరావత్ సుభాష్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను రక్షించుకోవాలి



మాట్లాడుతున్న జన్ను నర్సయ్య

వర్ధన్నపేట : టీడీపీ ప్రభుత్వ హయాంలో కొన్ని గ్రామాల్లో నిరుపేద దళితులకు భూములను కేటాయించగా అవి కొన్ని చోట్ల అన్యాక్రాంతం అయ్యాయని వాటిని పరిరక్షించుకోవాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం(టీఏఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య అన్నారు. శనివారం వర్ధన్నపేట పట్టణంలో దళిత సంఘాల నాయకులు కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో నర్సయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను పరిరక్షించుకునేందుకు కమిటీని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ భూముల పరిరక్షణ సమితి కన్వీనర్‌గా జన్ను రాములు, కో కన్వీనర్లుగా మరుపట్ల అంజయ్య, ఈరెల్లి శ్రీనివాస్, మల్లెపాక సమ్మయ్య, మారిపెల్లి ఎల్లయ్య, తూళ్ల అనిల్, వల్లందాస్ కుమార్, గద్దం కిష్టయ్య, జంగిలి భాస్కర్, ఎలికట్టి ప్రభాకర్‌ను నియమించారు.

యాదవులు ఆర్థికాభివృద్ధి సాధించాలి



పెర్కవేడులో లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను అందజేస్తున్న జేడీ బాలకృష్ణ

రాయపర్తి : రాష్ట్ర ప్రభుత్వం అందించే గొర్రెల యూనిట్లను సద్వినియోగం చేసుకొని యాదవులు ఆర్థికాభివృద్ధిని సాధించాలని జేడీ బాలకృష్ణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పెర్కవేడు గ్రామంలో యాదవులకు 30 యూనిట్ల మంజూరైన గొర్రెలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గొల్లకురుమలకు గొర్రెలను పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సోమశేఖర్, సర్పంచ్ చిన్నాల తారశ్రీరాజబాబు, ఎంపీటీసీ బండి అనూషరాజబాబు, యాదవసంఘం ప్రధానకార్యదర్శి సల్ల కొంరయ్య, యాదగిరి, లబ్ధిదారులు బండి నర్సయ్య, బండి ఎల్లయ్య, తోటకూరి కొంరయ్య, నిమ్మల కుమార్, సల్ల సోమయ్య, పుట్ట రాజు, బండి సాయిలు, కొంక సాయిలు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు జరభద్రం

- వర్షాకాలంలో అప్రమత్తత అవసరం
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు
- జాగ్రత్తలతో నివారణ సాధ్యం

ఖానాపురం : సీజనల్ వర్షాలు కురుస్తున్నాయి.. బావుల వద్ద, ఇళ్లలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ఉంటాయి.. దీంతో విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ఇళ్లు, పంట పొలాల వద్ద విద్యుత్ వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. వినియోగదారులు ఏ చిన్న పొరపాటు చేసినా ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడనుంది. ఈ సమయంలో రైతులు, ప్రజలు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.

బావుల వద్ద పాటించాల్సిన జాగ్రత్తలు

- విద్యుత్ మోటార్లను నేలపై కాకుండా ప్రత్యేకంగా గద్దె ఏర్పాటు చేయాలి. స్టార్టర్లు, బోర్డు తడవకుండా చూసుకోవాలి.
- మోటార్లు మరమ్మతుకు గురైతే మెకానిక్‌తోనే రిపేర్ చేయించాలి. సొంతంగా ప్రయత్నాలు మానుకోవాలి.
- సర్వీస్ వైర్లను, మోటార్లకు వాడే తీగలను నాణ్యమైనవి వాడుకోవాలి.
- సబ్ మెర్సిబుల్ మోటారుతో పాటు విద్యుత్‌వైరు ఉంటుంది. కొంచెం వైర్లు తెగి ఉన్న మోటార్ల నుంచి పైన ఉన్న పైపులకు విద్యుత్ సరఫరా వచ్చే అవకాశం ఉంది.



రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్

ఇంటి వద్ద పాటించాల్సిన జాగ్రత్తలు..

- తడిసిన స్తంభాలు, మీటర్లను ముట్టుకోకూడదు.
- ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను చేతులతో తాకవద్దు. చిన్నకర్ర లేదా ప్లాస్టిక్ వస్తువులతో స్విచ్ వేయాలి.
- చిన్న పిల్లలను దగ్గరకు రానీయకుండా చూసుకోవాలి.
- ఉతికిన దుస్తులను ఇనుప తీగలు వైర్లపై ఆరవేయకూడదు.
- గాలికి కిందపడిపోయిన విద్యుత్ తీగలను ముట్టుకోవద్దు.
- ఇంట్లో వాటర్‌హీటర్ స్విచ్ ఆఫ్ చేసిన తర్వాతనే నీళ్లు పెట్టిన వస్తువులను ముట్టుకోవాలి
- వర్షం, ఉరుములు పడిన సమయాల్లో ఇంట్లో డిష్‌లను తొలగించాలి.
- ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్లు డ్యామేజ్ అయి ఉంటే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలి.

నష్ట పరిహారం ఇలా పొందవచ్చు..

విద్యుత్ ప్రమాదాలతో మృత్యువాత పడితే మూడు రకాల ప్రమాదాలకే పరిహారం అందనుంది. మానవులకు, పశువులకు మాత్రమే పరిహారం అందనుంది. ప్రమాదవశాత్తు గాయాలైతే పరిహారం ఉండదు. మనుషులు మృత్యువాత పడితే రూ.5 లక్షలు, పశువులకు అయితే రూ.50వేలు, గొర్రెలు, మేకలు మృత్యువాత పడితే రూ.7వేల చొప్పున పరిహారం అందుతుంది. ప్రమాదం జరిగిన చోట ఫొటో, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, పోస్టుమార్టం పత్రాలను విద్యుత్ అధికారులకు అందించాల్సి ఉంటుంది. పశువులు అయితే ఫొటోతో పాటు పశువైద్యుల పోస్టుమార్టం రిపోర్ట్ అధికారులకు అందించాలి. అకస్మాతుగా విద్యుత్ తీగలు తెగి కిందపడినప్పుడు వాటికి తగిలి మనుషులు, పశువులు మరణిస్తే పరిహారం అందుతుంది. ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉన్నప్పుడు వాటికి తగిలి మృతి చెందితే పరిహారం అందుతుంది. కాబట్టి విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండడం మేలు.

అప్రమత్తంగా ఉండాలి

వర్షాలతో తడిసిన విద్యుత్ వస్తువులను ఎవరూ ముట్టుకోవద్దు. కరెంట్ తీగలు తెగిపడినా, ప్రమాదకరంగా ఉన్నా వెంటనే అధికారులకు సమాచారం అందించాలి. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం అధికారుల సహకారాన్ని తీసుకోవాలి. ప్రతీ మండలంలో అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటారు.

- మధుసూదన్‌రావు, ఎస్ఈ, వరంగల్

హైకోర్టు ఉత్తర్వు కాపీల అందజేత

నర్సంపేట : నర్సంపేట మున్సిపాలిటీలోని అన్ని డివిజన్లకు సమానమైన నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వు కాపీలను రాష్ట్ర మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీకి నర్సంపేట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ కౌన్సిలర్లతో కలిసి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సాంబయ్యగౌడ్ మాట్లాడుతూ.. గత నెల 26వ తేదీన నర్సంపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అన్ని డివిజన్ల అభివృద్ధి పనులకు సమానమైన నిధులు కేటాయించాలని నర్సంపేట మున్సిపల్ కమిషనర్, కలెక్టర్, జిల్లా కలెక్టర్ స్థానిక సంస్థలకు విన్నవించిన ఫలితం లేదన్నారు. అభివృద్ధి పనులు ప్రజలందరికీ ఆమోదయోగ్యంగా ఉండాలని, అన్ని డివిజన్లకు సమానమైన నిధులు కేటాయించాలని వారం రోజుల క్రితం హైకోర్టును ఆశ్రయించామన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ పురపాలక సంఘం పరిపాలన విభాగం వారికి నాలుగు వారాల వ్యవధి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ నిధుల కేటాయింపుపై చర్యలు తీసుకోవాలని సూచించారని అన్నారు.